మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## దేవాలయ భూమి జోలికొస్తే ఉపేక్షించేదిలేదు

**-ఆర్డీవో, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన బిజెపి నాయకులు**

**గజ్వేల్, జూన్ 26, ప్రభాతవార్త:**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌పరిధిలోని సర్వే నెం.338లోగల శివాలయానికి సంబంధించినభూమిని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని, ఆభూమిని కాపాడాలని గజ్వేల్ ఆర్డీవో, తహసీల్దార్‌లకు స్థానిక బిజెపినాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బిజెపినాయకులు మాట్లాడుతూ మున్సిపల్‌పరిధిలోని సంగాపూర్ రోడ్డులోగల ఐఓసి భవనంవెనకాల ఉన్న ఖాళీస్థలాన్ని ప్రస్తుత ప్రభుత్వం మాకు కేటాయించిందని గజ్వేల్‌కు చెందిన కొందరువ్యక్తులు కబ్జాచేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌పరిధిలో గతంలోజరిగిన అభివృద్ధి సందర్భంగా చాలామంది భూములు, నివాసాలనుకోల్పోగా వారికి నష్టపరిహారంగా నగదురూపంలో ఇవ్వడం జరిగిందని, ఎవరికీ భూమికి బదులు భూమి ఇవ్వలేదని అన్నారు. ప్రస్తుతం కోర్టుపరిధిలో, దేవాదాయశాఖ అధీనంలో ఉన్న కొన్నికోట్ల విలువచేసే దేవాలయభూమిని మాకు ఇచ్చారని కొంతమంది కాగితాలు చూపించి కబ్జా చేసే ప్రయత్నంచేస్తున్నారని తమదృష్టికి రావడం జరిగిందన్నారు. దేవాలయభూమి పరిరక్షణకోసం గజ్వేల్ ప్రజలందరినీ, హిందువులందరినీ ఏకంచేసి పోరాటంచేస్తామని హెచ్చరించారు.

## కాంగ్రెస్, బిజెపిలే బిసిల వెనుకబాటుకు కారణం

**-బిఎస్పి సెంట్రల్, స్టేట్ కోఆర్డినేటర్ రామచంద్రం**



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రం

**హుస్నాబాద్ టౌన్, జూన్ 26, ప్రభాతవార్త:**

దేశంలో బిసిల వెనుకబాటుకు కారణం కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలే అని బిఎస్పి సెంట్రల్, స్టేట్ కోఆర్డినేటర్ నిషాని రాంచంద్రం అన్నారు. గురువారం సాహుజీ మహారాజ్ జయంతి వేడుకలు పట్టణ కేంద్రంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్స రాలు పూర్తైనా దేశం ఏమీ అభివృద్ధి చెందలేదని ముఖ్యంగా బిజెపి, కాంగ్రెస్‌లు బలహీన వర్గాలను అణచివేతకు గురిచేశాయని అన్నారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. దేశంలో దాదాపు 40 ఏళ్ల పైన అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాగంలో రాసిన 340ఆర్టికల్ అమలు చేయకుండా అణచివేసిన విషయాన్ని గుర్తుచేశారు. బహుజనులకు రాజ్యాధికారం రావాలంటే అది బిఎస్పితోనే సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో బిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న, జిల్లా ఇంచార్జ్ తిరుపతి, జిల్లా ప్రధానకార్యదర్శి నరేష్, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు, సీనియర్ నాయకులు సుధాకర్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## పిఎంఎఫ్‌ఎంఈ స్కీంపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎడి డిఆర్‌డివోల దృశ్యం

**అక్కన్నపేట, జూన్ 26, ప్రభాతవార్త:**

ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పిఎంఎఫ్ఎంఈ) స్కీంపై మండల ప్రజలకు గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా ఈకార్యక్రమానికి అడిషనల్ డిఆర్‌డివోలు సుధీర్, రవికుమార్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బిసిసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిఎ మల్లేశంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ స్కీంలో ఉండే యూనిట్లు వాటిని ఎంచుకునే విధానంతోపాటు లబ్దిదారులకు వచ్చే సబ్సిడీల గురించి వివరించారు. ఈ స్కీం కింద లోన్లకు దరఖాస్తు చేసుకున్న సభ్యులకు మహిళా సంఘాల ద్వారా రూ.10లక్షల నుండి 30లక్షల వరకు లోన్లు అందించి అందులో 30శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తిగలవారు ఈ స్కీంను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఆసక్తిగల వ్యక్తుల నుండి 39దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాస్, డిఆర్‌పి వంశీ, సిసిలు శివచరణ్‌సింగ్, తిరుపతి, రాజు, శ్రీలత, మండల సమాఖ్య అధ్యక్షురాలు అశ్వినితోపాటు తదితరులు ఉన్నారు.

## ఎనగండ్లలో బిజెపి రచ్చబండ

**కొల్చారం, జూన్ 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఎనగండ్లలో గురువారం శక్తి కేంద్ర ఇంచార్జ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ హాజరై ప్రసంగించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి(ఎల్ఈడి వీధి దీపాలు, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డ్‌లు, సిసి రోడ్డు, గ్రామాల్లో స్వచ్ఛ భారత్, ఉచిత రేషన్ బియ్యం) లాంటి పథకాలు గత 11సంవత్సరాలుగా కొనసాగుతున్న వివరాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు ఘనపూర్ హరీష్, మండల ఉపాధ్యక్షులు వెంకట్‌యాదవ్, మండల కార్యదర్శి నాగరాజు, మాజీ ఉపాధ్యక్షులు పుట్టి ప్రకాష్, నాయకులు నగేష్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, ఒగ్గు మహేష్‌యాదవ్, కొరబోయిన సత్యనారాయణముదిరాజ్, ఎనగండ్ల బూత్ అధ్యక్షులు మంగలి లింగంనాయి, విఠల్, గురుకుల భాగయ్య, దేశబోయిన దాస్, చాకలి మల్లేష్, హనుమంతు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసిన ఎడిఎ



మైకోడ్‌లో ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ నూతన్‌కుమార్

**మనూర్, జూన్ 26, ప్రభాతవార్త:**

ప్రతి రైతు వ్యక్తిగత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నారాయణఖేడ్ డివిజన్ ఎడిఎ నూతన్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎల్గోయి, మాయికోడ్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను నూతన్‌కుమార్ తనిఖీ నిర్వహించారు. దుకాణాల్లోని రిజిస్టర్‌లను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు. డివిజన్ పరిధిలోని రైతులు తమ వ్యక్తిగత కార్డుల కొరకు ఎఈఓలను సంప్రతించి రిజిస్ట్రేషన్ చేయించువాలన్నారు. ఆధార్‌కార్డుకు లింక్ ఉన్న ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఆధార్‌కార్డుకు ఫోన్‌నంబర్ లింక్ లేకుంటే రైతు ఫోటో ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎఓ మహేష్‌చౌహాన్, ఫర్టిలైజర్ డీలర్లు, రైతులు తదితరులు ఉన్నారు.

## రైతుపండుగ పేరుతో సంబరాలు దేనికోసం?

**-బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, జూన్ 26, ప్రభాతవార్త:**

అబద్ధపు, అసత్యపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ప్రభుత్వం రైతుపండుగ పేరుతో సంబరాలు చేయడం దేనికోసమని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నాలుగుసార్లు రైతుభరోసాను ఎగ్గొట్టిందని, ప్రస్తుతం స్థానికసంస్థల ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి ప్రజలను, రైతులను మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్‌ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని అన్నారు. సాగుకు యోగ్యంగా ఉన్న భూములకు భరోసా ఇవ్వకపోవడం చాలా దారుణమని, రాష్ట్రంలో చాలామంది రైతులు రైతుభరోసా కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రుణమాఫీ రూ.2లక్షలు సైతం చేయని కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం ఏమిటన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18నెలల్లో దాదాపు 550మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలను తీసుకువస్తే కొనుగోలు చేయకుండా నెలల తరబడి కాలయాపన చేయడంతో అకాల వర్షాలకు రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. రేవంత్‌రెడ్డి కల్లబొల్లి మాటలు నమ్మే పరిస్థితిలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు లేరని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి పట్టం కడతారని తెలిపారు.

## డ్రగ్స్‌రహిత సమాజం ప్రతిఒక్కరి బాధ్యత

**-జోగిపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్**

**జోగిపేట, జూన్ 26, ప్రభాతవార్త:**

డ్రగ్స్‌రహిత సమాజంకోసం ప్రతిఒక్కరు పాటుపడాలని జోగిపేట సిఐ అనిల్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జోగిపేటలో పోలీసుల ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అంబేదర్కర్ చౌరస్తాలో సిఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్‌బారినపడి చాలామంది యువత తమ విలువైన జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. డ్రగ్స్‌కు అలవాటైతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోనాల్సి ఉంటుందని అన్నారు. మన రాష్ట్రప్రభుత్వం డ్రగ్స్‌రహిత సమాజమే లక్ష్యంగా పనిచేస్తుందని, అందుకని ప్రతిఒక్కరు ఇందుకు సహకరించాలన్నారు. డ్రగ్స్‌కు సంబంధించి ఏమైనా సమాచారం ఉంటే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. డ్రగ్స్‌రహిత సమాజంకోసం అందరం పాటుపడదామంటూ అందరిచేత ప్రమాణం చేయించారు. ఇందులో జోగిపేట ఎస్ఐ పాండు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

**-జిల్లా కలెక్టర్ హైమావతి**



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

రోడ్డుప్రమాదాల నివారణకు అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం పోలీసు, నేషనల్ హైవే, సంబంధితశాఖల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ, రాజీవ్ రహదారి వెంట సర్వీస్‌రోడ్డు లేకపోవడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, మూలమలుపుల వద్ద రోడ్డు కనిపించకుండా ఆవరించిన మొక్కలు, చెట్లపొదలను తొలగించాలన్నారు. గ్రామీణప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. రాజీవ్‌రహదారి వెంట రోడ్డు ప్రమాదాలు జరిగే 10ప్రదేశాలను పోలీసుశాఖ గుర్తించిందని పోలీసు, నేషనల్ హైవే, సంబంధిత శాఖల అధికారులు జాయింట్ పరిశీలనచేసి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై బస్సులు ఆపకుండా చూడాలని రోడ్డు ప్రమాదాలు ఎక్కువగాజరిగే సిద్దిపేట, కుకునూర్ పల్లి, గజ్వేల్, గౌరారం లాంటి ప్రాంతాల్లో జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటుచేసి రోడ్డుదాటడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం డ్రగ్ కంట్రోల్‌పై సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిఈవో, డిఈలు, టౌన్‌ప్లానింగ్, పోలీసు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

**మాదకద్రవ్యాల బారినపడి జీవితాలను బలిచేసుకోవొద్దు...**

మాదకద్రవ్యాల బారినపడి ఎవరూ జీవితాలను ఇబ్బందుల పాలు చేసుకొవొద్దని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద ర్యాలీని సిపి డాక్టర్ అనురాధతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. బాలుర జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ మెదక్ రోడ్డుగుండా పాతబస్టాండు అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిసలుగా మారిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి బాధితులకు అవగాహన కల్పించే దిశగా 1987లో ఈకార్యక్రమాన్ని ప్రారంభించుకొని ప్రతియేటా జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దన్నారు. సిపి డాక్టర్ అనురాధ మాట్లాడుతూ, ఎవరూ డ్రగ్స్‌బారిన పడొద్దని, మనదేశం డ్రగ్స్‌ఫ్రీ దేశంగా మారాలని అకాక్షించారు. డ్రగ్స్‌రహిత సమాజం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అధికారులు, పోలీసు సిబ్బంది, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌రహిత జిల్లాగా సంగారెడ్డిని మారుద్దాం

భారీర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు, విద్యార్థులు




ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, విద్యార్థులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూన్ 26, ప్రభాతవార్త:**

మహిళా,శిశుసంక్షేమశాఖ, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్ కార్యాలయం నుండి ఐబి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాకలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జూన్ 26, యాంటీడ్రగ్‌డే,మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా నిర్మూలనే లక్ష్యంగా జిల్లా కలెక్టరేట్ నుండి ఐబి కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులచే ర్యాలీలు నిర్వహించి, ప్రతి ఒక్కరూ యాంటీడ్రగ్ సోల్జర్‌గా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ అవగాహన కార్యక్రమాలను కేవలం యాంటీడ్రగ్‌డే వారోత్సవాలలో భాగంగా కాకుండా సంగారెడ్డి జిల్లా డ్రగ్‌ఫ్రీ జిల్లాగా మార్చేవరకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భావి తరాలకు డ్రగ్‌ఫ్రీ సమాజాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జిల్లా ఎస్పి పరితోష్‌పంకజ్‌లు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాను డ్రగ్‌ఫ్రీ జిల్లాగా మార్చడంలో కృషిచేస్తున్న సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ, ఎక్సైజ్‌శాఖకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎక్సైజ్ ఎస్పి నవీన్ చంద్ర, అదనపు ఎస్పి ఎ.సంజీవరావ్, డిఇఓ వెంకటేశ్వర్లు, వివిధశాఖలకుచెందిన జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థినీ విద్యార్థులు, పట్టణ యువత, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో పర్యటించనున్న మంత్రులు

**-ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కె.హైమావతి**

**హుస్నాబాద్ రూరల్, జూన్ 26, ప్రభాతవార్త:**

నేడు అనగా శుక్రవారం హుస్నాబాద్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులు పర్యటించి పలు అభివృద్ధి కార్య క్రమాలు ప్రారంభించనున్న నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కె.హైమావతి అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఏర్పా ట్లను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హుస్నా బాద్‌లో పర్యటించే మంత్రులు నూతనంగా నిర్మించిన 50 పడకల మాత,శిశు ఆసుపత్రితోపాటు అదే ప్రాంగణంలో మరో 250పడకల ప్రభుత్వ వైద్యశాలకు శంకుస్థాపనచేస్తారని అనం తరం కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి పరుచుటకు శంకుస్థాపన చేసి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటుచేసే పబ్లిక్ మీటింగ్‌కు హాజర వుతారన్నారు. మంత్రుల పర్యటనలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా ఉండేందుకు పటిష్టబందోబస్తుతోపాటు ఉండా ల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పోలీస్‌శాఖతోపాటు ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లు పరిశీలిం చిన వారిలో ఆర్డీవో రాంమూర్తి,డిఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్, డిసిహెచ్ఎస్ అన్నపూర్ణ, ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్‌తోపాటు ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

**-ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్...**



రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమరవాణా నిర్మూలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ హైమావతి అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు,ప్రజలకు మాదకద్రవ్యాలు,గంజాయి, మత్తుపదార్థాల వల్ల జరిగే అనర్థాలను వాటిని విక్రయించడం, సేవించడం లాంటివి చేసేవారిపై తీసుకునే చట్టపరమైన చర్యలను గురించి వివరించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రాంమూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్, ఎసిపి సదానందరం, సిఐ కోండ్ర శ్రీనివాస్, ఎస్ఐ తోట మహేష్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు ప్రక్రియ

**-మండల వ్యవసాయ అధికారిణి దీపిక**



విలేకరులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారిణి దీపిక

**నర్సాపూర్, జూన్ 26, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో కీలకం అయినటువంటి ప్రత్యేక పథకం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు ప్రక్రియ జరుగుతుందని, వ్యవసాయ మండలాధికారిణి దీపిక అన్నారు. బుధవారం నర్సాపూర్ వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన వివరాలను వ్యవసాయశాఖకు అందించాలన్నారు. ఇందుకోసం పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు నెంబర్, ఆధార్ కార్డుకు జత చేసినటువంటి మొబైల్‌ఫోన్ నెంబర్ అందజేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించినట్లయితే 11 అంకెలతో కూడినటువంటి రైతు విశిష్ట సంఖ్య అందజేయబడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతుల కోసం చేపట్టినటువంటి వివిధ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత ఉండడానికి ఈ విశిష్ట సంఖ్య ఎంతో కీలకం కానుంది అన్నారు. కావున రైతులు తప్పనిసరిగా ఈ రైతు విశిష్ట సంఖ్యను పొందడానికి పైన పేర్కొన్నటువంటి వివరాలు వ్యవసాయ శాఖ ఎఈఓలకు అందజేయాలని తెలియజేశారు. ఈ విశిష్ట సంఖ్య కేంద్ర ప్రభుత్వం చేపట్టేటువంటి సంక్షేమ పథకాలైన సిఎం కిసాన్, సమ్మాన్ నిధి, పసల్ బీమా యోజన, రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన వంటి పథకాలు అమలులో తప్పనిసరి అన్నారు. వచ్చే 20 విడత పిఎం కిసాన్ సమాన్ నిధి నిధులు విడుదల కావాలంటే ఈ 11 సంఖ్యల రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి అని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దీపిక కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమ ఇసుక రవాణా

**-3 ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు**



ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన దృశ్యం

**కోహెడ, జూన్ 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని పోరెడ్డిపల్లి గ్రామ శివారులో గల మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పోలీసులు సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. పోరెడ్డిపల్లి గ్రామం నుంచి హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు అక్రమంగా ఇసుకను తీసుకెళ్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. పోరెడ్డిపల్లి, నాగసముద్రాలకు చెందిన మంద చంద్రమౌళి, అసర్ల వంశీ, ఈరాళ రఫిక్‌లు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా సీజ్ చేసి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## ఓపెన్ డ్రైన్ నిర్మాణానికి 35లక్షల మంజూరు

**-కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్**



ఓపెన్ డ్రైన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూన్ 26, ప్రభాతవార్త:**

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు పడుతున్న పాట్లను పరిష్కరించేందుకు ఓపెన్ డ్రైన్ నిర్మాణానికి 35లక్షల రూపాయలు మంజూరు అయినట్లు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పేర్కొన్నారు. గురువారం కాలనీలో ఓపెన్ డ్రైన్ నిర్మాణానికి జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాలనీ వాసులతో కలిసి సమస్య నెలకొన్న ప్రాంతాలను పరిశీలించారు. త్వరలోనే 600 ఎంఎం డాయతో పైన్‌లైన్ వేయిస్తామని కార్పొరేటర్, స్టాండింగ్‌కమిటి సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ పేర్కొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దాం

**-గజ్వేల్ ఏసిపి నరసింహులు**



ప్రజ్ఞాపూర్‌లో అవగాహన ర్యాలీ న్విహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

**గజ్వేల్ టౌన్, జూన్ 26, ప్రభాతవార్త:**

డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం, డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దామని గజ్వేల్ ఏసిపి నరసింహులు అన్నారు. గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐలు సైదా, ముత్యంరాజు, ట్రాఫిక్ సిఐ మురళి, ఎక్సైజ్ ఎస్ఐలు శ్రీనివాస్, సాయికృష్ణ, ప్రధానోపాధ్యాయులు అనురాధ, శారద, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా సుభాష్‌రావు

**జహీరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:**

జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన డి.సుభాష్‌రావు గురువారం మున్సిపల్ కార్యాలయంలో పదవీబాధ్యతలు స్వీకరించారు. సుభాష్‌రావు గతంలో మూడు సార్లు కమిషనర్‌గా సేవలు అందించి ఉన్నారు. ఇంతవరకు కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఉమామహేశ్వరరావు హైద్రాబాద్‌లోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో రిపోర్టు చేయా ల్సిందిగా అధికారులు ఆదేశించారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుభాష్‌రావును ఆయా రాజకీయ పార్టీ నాయకులు, ఆయా సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాలతో సత్కరించారు.

# ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలి

## -సిపి డాక్టర్ అనురాధ



పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సిపి డాక్టర్ అనురాధ

**చేర్యాల, జూన్ 26, ప్రభాతవార్త:**

ప్రజలరక్షణ ధ్యేయంగా విధులు నిర్వహించి మన్ననలు పొందాలని సిపి డాక్టర్ అనురాధ ఆదేశించారు. చేర్యాల, మద్దూరు పోలీసు స్టేషన్లను గురువారం ఆమె అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్ల చుట్టూ పరిసర ప్రాంతాలను, సీజ్‌చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డు, రైటర్‌గదులను పరిశీలించి పోలీసు స్టేషన్లలో మొక్కలు నాటారు. అనంతరం అమె మాట్లాడుతూ పోలీసు స్టేషన్లలో వివిధ కేసులలో ఉన్న వాహనాల అడ్రస్ తెలుసుకొని సంబంధిత యజమానులకు త్వరగా అప్పగించాలని ఎస్ఐలను ఆదేశించారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి త్వరగా వారిసమస్యలను పరిష్కరించాలన్నారు. ఇసుక, జూదం, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేయాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది క్రమ శిక్షణతో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నీతి నిజాయితీగా విధులు నిర్వహించి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. పాత నేరస్థులైన కెడిలు, డిసిలు, సస్పెక్ట్‌లను తరచుగా తనిఖీలు చేయాలన్నారు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. ఆయా కార్యక్రమంలో హుస్నాబాద్ ఎసిపి సదానందం, చేర్యాల సిఐ శ్రీను, ఎస్ఐలు నిరేష్, షేక్ మహబూబ్, సిసిఆర్బి సిఐ రామకృష్ణ, ఎస్‌బి సిఐ శ్రీధర్‌గౌడ్, కోర్టు మానిటర్ ఎస్ఐ రాజేష్, ఎఎస్ఐ సదాశివరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, నరేందర్, నాగిరెడ్డి, జనార్ధన్, సిబ్బంది, సిసి నితిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కు తీర్చుకున్న ముఖ్యమంత్రి అత్తమామ



స్వామివారి సన్నిధిలో ముఖ్యమంత్రి మామ కుటుంబం సభ్యులు

**గుమ్మడిదల, జూన్ 26, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెం వార్డులో ప్రసిద్ధి గాంచిన దైవక్షేత్రం భద్రకాళి సమేత వీరభద్రస్వామి క్షేత్రంలో గురువారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, తల్లి, తండ్రి, పద్మారెడ్డి, ధర్మపత్నిని పారిజాతం, కుటుంబ సమేతంగా వీరభద్రస్వామి పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. కుంకుమార్చనలు, స్వామివారి కళ్యాణం నిర్వహించారు. ఆలయ నిర్వహణ కార్యదర్శి, శశిధర్ గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, వేదపండితుల మధ్య శాలువాలతో సన్మానంచేసి వారిని ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్నప్పుడు తమ అల్లుడు ఎనుముల రేవంత్‌రెడ్డి తెలంగాణరాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే ప్రత్యేకంగా దర్శించుకుని ప్రార్థనలు, పూజనిర్వహించి, మొక్కు తీర్చుకుంటామని కోరుకున్న విధంగా రావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ చైర్మన్ సురభి నాగేంద్రగౌడ్, లక్ష్మీ మనారాయణ, మూడు చింతల నరేందర్‌రెడ్డి, తులసిదాస్, ఆలయ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, సుధాకర్, సిబ్బంది సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాచ్నూర్‌లో సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం

**ఝరాసంగం, జూన్ 26, ప్రభాతవార్త:**

రైతులకు సకాలంల రైతుభరోసా డబ్బులు పంపిణీచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలుపుతూ సిఎం చిత్రపటానికి పాలాభిషేకంచేశారు. మండల పరిధిలోని మాచ్నూర్‌లో గురువారం డిసిసి ఉపాధ్యక్షులు ముల్తాని, సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు, రైతులు తదితరులు సిఎంకు అనుకూలంగా నినాదాలుచేస్తూ పాలాభిషేకం చేశారు.

## మూతపడిన పాఠశాల పునఃప్రారంభం



మూతపడిన పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంఈఓ ధనుంజయగౌడ్

**అల్లాదుర్గం, జూన్ 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని కాన్సిరాం నగర్ కాలనీలో మూతబడిన ప్రాథమిక పాఠశాలను గురువారం మండల విద్యాధికారి ధనుంజయగౌడ్ తిరిగి ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులు లేక పాఠశాలను మూసేశారు. కాలనీ వాసులు వినతి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఈఓ గురువారం పాఠశాలను ప్రారంభించారు. కాలనీలో మూతబడిన పాఠశాల తిరిగి ప్రారంభం కావడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలకే విద్యను అందుకునేందుకు పంపుతామని కాలనీ వాసులు తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, కార్యదర్శి ప్రభాకర్, సిఆర్‌పలు తదితరులు ఉన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత

**-తొగుట సిఐ లతీఫ్**



మాదకద్రవ్యాలపై అవగహన కల్పిస్తున్న తొగుట సిఐ లతీఫ్

**రాయపోల్, జూన్ 26, ప్రభాతవార్త:**

యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని తొగుట సిఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ రఘుపతి అన్నారు. గురువారం రాయపోల్ మండలకేంద్రంలో విద్యార్థులతోకలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ..యువత డ్రగ్స్ బారిన పడవద్దని డ్రగ్స్‌వాడితే వారిభవిష్యత్ అంధకారమేనని వారన్నారు. డ్రగ్స్‌ను తయారు చేయడం, రవాణా చేయడం, వినియోగించడం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా డ్రగ్స్‌ను అరికట్టేందుకు కృషిచేయాలని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఎటువంటి సమాచారం తెలిసినా డయల్ 100, 1908 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

## రైతులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ములుగు, జూన్ 26, ప్రభాతవార్త:**

మండలకేంద్రమైన ములుగు రైతు వేదికలో ఈనెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు జీడిమెట్ల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పాల్గొని ఉత్తమమైన వ్యవసాయ పద్దతులలో కూరగాయల సాగుపై రైతులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పక్కా ఇళ్లతోనే పేదలకు ఆత్మగౌరవం

**-మండల కాంగ్రెస్ అధ్యక్షులు నత్తి దశరథ్**



ఇళ్ల మంజూరు పత్రాలను అందచేస్తున్న కాంగ్రెస్‌నేత నత్తి దశరథ్

**చౌటకూరు, జూన్ 26, ప్రభాతవార్త:**

పక్కా ఇళ్లతోనే పేదల ఆత్మగౌరం దక్కుతుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ అన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచనల మేరకు గురువారం మండల కేంద్రమైన చౌటకూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన లబ్దిదారులకు మంజూరు పత్రాలను దశరథ్ అందచేశారు. ఈ సందర్భంగా నత్తి దశరథ్ మాట్లాడుతూ గ్రామానికి మంజూరైన 29 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినట్లు, 15మంది లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందచేశామని, మిగతా 14మందికి త్వరలోనే అందచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, నాయకులు కలాలి ఈశ్వర్‌గౌడ్, రామాగౌడ్, వర్కల రమేష్, కైసర్, ఆగమయ్య, వివోఏ గౌని కిరణ్, శోభ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పిఆర్‌టియు లక్ష్యం



చంద్రురాథోడ్ దంపతులను సన్మానిస్తున్న మాజీమంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పిఆర్‌టియు లక్ష్మమని పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్ అన్నారు. మొగడంపల్లి మండల పిఆర్‌టియు టిఎస్ అధ్యక్షులు చంద్రు రాథోడ్ పదవీ విరమణ చేసిన సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని పటేల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. చేసిన సేవలే గుర్తింపును ఇస్తాయని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియు ఎస్ జిల్లా అధ్యక్షులు ఆకుల మాణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రభు, జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ తులసిరామ్ రాథోడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డి శ్రీనివాస్, వరాలు, నర్సయ్య, కె.సురేందర్, కిఫాయత్ అలీ, రమేష్ బానోత్, అమర్నాథ్‌రెడ్డి, నరోత్తం, బాగయ్య, ఆనంద్, తుకారామ్, చవ్వాన్, అశోక్, తిరుమలేష్, శ్రీదర్‌నాథ్, రమాకాంత్, వేణుగోపాల్, యాదవులు, ప్రశాంత్, మురళీధర్, పాండయ్య, వెంకట్‌రెడ్డి, ఎంఇఓ జాఫర్ అలీ, జి.మాణయ్య, మారుతి రాథోడ్, శ్రీనవాస్ బానోత్, యు మొగులయ్య, హీరాలాల్ వ్వాన్ హన్మంత్ పవార్, జౌసింగ్ చవ్వాన్, జిహెచ్ఎం తుల్జాబాయి, కె.అనిత, ఆంజనేయులు, నాణుసింగ్, టిబేస్ రాష్ట్ర అధ్యక్షులు పిపి రాథోడ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంజ్యానాయక్, ప్రధాన కార్యదర్శి అర్జున్ చవ్వాన్, మాజీ జడ్పీటిసి సభ్యులు నాగిశెట్టి రాథోడ్, సొసైటీ మాజీ చైర్మన్ కిషన్ రావు పవార్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మక్సుద్, కాంగ్రెస్ నాయకులు కండెం నర్సింలు, ఎంజి రాములు యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ



కడపల్ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగారం శ్రీనివాస్

**సిర్గాపూర్, జూన్ 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కడపల్ గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలను గురువారం మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ పరిశీలించారు. పాఠశాలలో 1వ తరగతిలో విద్యాబోధన చేస్తున్న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు బన్సీలాల్ తరగతిని ఎంఈఓ ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని పాఠశాల ఉపాధ్యాయులకు ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చౌకి వెంకటేశం, ఉపాధ్యాయులు శోభ, బస్వరాజ్, రాజు, మల్లేశంలు ఉన్నారు.

## యూత్ కబడ్డీ నేషనల్ చాంపియన్‌షిప్ కోచ్‌గా మల్లేష్




తెలంగాణ జట్టుతో కోచ్ మల్లేష్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 26, ప్రభాతవార్త:**

అండర్18 యూత్ కబడ్డి నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో జరుగుతుండగా తెలంగాణ జట్టుకు కోచ్‌గా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన గంగదరి మల్లేశం ఎంపిక కావడం పట్ల కబడ్డీ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు మాట్లాడుతూ సీనియర్ కబడ్డీ ప్లేయర్‌గా మల్లేష్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో కబడ్డీ పోటీలలో పాల్గొని ఎన్నో మెడల్స్ సాధించారని గుర్తు చేశారు. మల్లేష్‌ను రాష్ట్రం తరపున ఆడుతున్న జట్టుకు కోచ్‌గా నియమించి పంపించిన తెలంగాణ కబడ్డి అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్‌ముదిరాజ్, ప్రధానకార్యదర్శి మహేందర్‌రెడ్డిలకు కబడ్డి అసోసియేషన్ సభ్యులు గద్దల రమేష్, పులికాశి రమేష్, బాబు, సందీప్, అంబదాస్, అనిల్, శ్రీనివాస్, త్రిమూర్తి ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు.

## ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను బోధించాలి

**-ఎంఈఓ బచ్చలి సత్తయ్య**

**కొండపాక, జూన్ 26, ప్రభాతవార్త:**

ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రీప్రైమరీ విద్యార్థులకు విద్యను బోధించాలని ఎంఈఓ బచ్చలి సత్తయ్య సూచించారు. గురువారం కుకునూరుపల్లి మండల పరిధిలోని రాయవరం ప్రాథమికపాఠశాలలో బాల వాటిక ప్రీప్రైమరీ తరగతులను, అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు జయశ్రీ విద్యార్థుల కోసం ఉచితంగా అందించిన వాటర్ ఫిల్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చక్కని విద్యనందించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దటం జరుగుతుందన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి వాటర్‌ఫిల్టర్‌ను ఉచితంగా అందించిన ఉపాధ్యాయురాలు జయశ్రీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయులు, సిఆర్‌పి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## దామరకుంటలో విద్యార్థుల ర్యాలీ




దామరకుంటలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

**మర్కుక్, జూన్ 26, ప్రభాతవార్త:**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మర్కుక్ ఎస్ఐ దామోదర్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు వాడడం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. డ్రగ్స్ రహిత సమాజం మనందరి బాధ్యత అని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయించినా, సేవించినా స్థానిక పోలీసులకు లేదా 1908 నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వర్గల్‌లో...**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలకేంద్రమైన వర్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చు!

**-జోగిపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్**

**జోగిపేట, జూన్ 26, ప్రభాతవార్త:**

రక్తదానం చేయటంవల్ల ఇతరుల ప్రాణాలను కాపాడినవారమౌతామని జోగిపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. ఎస్‌బిఐబ్యాంకు స్థాపించి డెబ్బై ఐదు వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బ్యాంకు ఆధ్వర్యంలో గురువారంనాడు రక్తదానశిబిరం నిర్వహించారు. జోగిపేటలోని రెండు బ్రాంచిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈరక్తదానశిబిరాన్ని జోగిపేట సిఐ అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం చాలా గొప్పవిషయమని, చాలామట్టుకు రక్తదానం చేయడానికి వెనకాడు తుంటారని, అయితే రక్తదానం చేయటం వల్ల ఏలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన సూచించారు. రక్తదానం చేయటం వల్ల ఆపదలో అవసరం ఉన్నవారికి ఈరక్తాన్నివాడి, వారి ప్రాణాలను కాపాడగలుగుతారని పేర్కొన్నారు. రక్తదానం విషయంలో ప్రజలకు ఉన్న అపోహలను తొలగించి పెద్దఎత్తున రక్తదానం చేయడానికి ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పలువురు దాతల నుంచి రక్తాన్ని వైద్యసిబ్బంది సేకరించారు. ఈ కార్యక్రమంలో జోగిపేటకు చెందిన రెండు ఎస్‌బిఐ బ్రాంచ్‌ల మేనేజర్లు నాగరాజు, షేక్ శమాలతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాల జోలికి పోవద్దు

**-నర్సాపూర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దామోదర్..**



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ తదితరులు

**నర్సాపూర్, జూన్ 26, ప్రభాతవార్త:**

యువత మాదకద్రవ్యాల జోలికి పోయి తమ ఆరోగ్యాలను పాడు చేసుకోవద్దని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేకదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ మాట్లాడుతూ యువకులు తాత్కాలిక మత్తు కోసం గంజాయి డ్రగ్స్ లాంటి వాటికి అలవాటు పడి, మాదకద్రవ్యాలతో శరీరానికి హాని కలిగించి బలి అవుతున్నారని తెలిపారు. యువత మాదకద్రవ్యాలపై దృష్టి పెట్టకుండా జాగ్రత్త వహించి చదువుపై దృష్టిపెట్టి బంగారు భవిష్యత్తును పొందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రమేష్ డాక్టర్ రవి ఆరి ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## మండలపరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ

**కొల్చారం, జూన్ 26, ప్రభాతవార్త:**

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడిఓ రఫీక్ ఉన్నీసా అధ్యక్షతన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 21 పంచాయితీలలో 2024 జూన్ మాసం నుంచి 2025 జూన్ వరకు పంచాయితీరాజ్, ఎన్ఆర్ఈజిఎస్, అటవీ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ఉపాధి హామి పనులపై తనిఖీ బృంధం చేసిన సర్వే వివరాలను సభలో వివరించారు. ఆయాగ్రామాల్లో 4కోట్ల65లక్షల రూపాయలతో వివిధ పనులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పనులు చేపడుతున్న తరుణంలో క్షేత్ర సహాయకులు మాస్టర్స్‌లో దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు ఏపీడీ వివరించారు. దిద్దుబాటు చర్యలు చేపట్టిన వారికి 3వేల 322 రూపాయల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ కృష్ణవేణి, ఏపిఓ మహిపాల్‌రెడ్డి, మండల స్థాయి ఉపాధి హామి సిబ్బంది, కూలీలు, ప్రజలు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**చౌటకూరు, జూన్ 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని సుల్తానాపూర్ గ్రామానికి చెందిన గొల్ల నిఖిల్‌కు గ్రామ మాజీ సర్పంచ్ గండన్నోల్ల శ్రీనివాస్‌రెడ్డి బుధవారం49వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేశారు. ఇటీవల గ్రామానికి చెందిన రవికుమార్ కుమారుడు నిఖిల్ విద్యుత్ ప్రమాదానికి గురైన విషయం పాఠకులకు విధితమే. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నత్తి దశరథ్, సొసైటీ డైరెక్టర్ గంట లలిత, పంచాయితీ కార్యదర్శి పావని, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చంటి రమేష్, నాయకులు మంగలి మహేష్, వసంతగౌడ్, గొల్ల మహేష్ ఫాజిల్, గంట దేవయ్య పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన కార్పొరేటర్ సింధూ

**రామచంద్రాపురం, జూన్ 26, ప్రభాతవార్త:**

భారతీనగర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్వాహణకు శ్రీకారం చుట్టారు. డివిజన్ పరిధిలోని బాంబే కాలనీలో మోడల్ రైతు బజార్‌లో పార్కింగ్ సదుపాయం కొరకు 12లక్షల రూపాయలతో నిర్మించే గ్రిల్స్ పనులకు కార్పొరేటర్ భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. కమ్యూనిటీ హాల్‌లో 22లక్షల రూపాయలతో నిర్మించే ప్రహరీ గోడ నిర్మాణానికి కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఎంపిపిఎస్ పాఠశాలలో శ్రీ సత్యసాయి సేవాసమితి, ఐటీసి పేపర్‌బోర్డ్స్, స్పెషాలిటీ పేపర్స్ డివిజన్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీచేశారు. బస్తీ దవాఖానాను కార్పొరేటర్ సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు, ఇతర సౌకర్యాలపై కార్పొరేటర్ ఆరాతీశారు. డివిజన్ అభివృద్ధికి, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, ఆరోగ్య, విద్య, ప్రోత్సాహం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఏఈ ఫైజాన్, బస్తీ దవాఖానా డాక్టర్ స్రవంతి, సత్యసాయి సేవా సమితి సభ్యులు సత్యవతి, ఇందిరా, ప్రవీణ్, బిఆర్ఎస్ సర్కిల్ యూత్ అధ్యక్షులు నరసింహ, మైనార్టీ సెక్రటరీ గౌస్, నాయకులు జైపాల్, వెంకట్‌రెడ్డి, నరేష్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా దశరథ్

**గుమ్మడిదల, జూన్ 26, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా దశరథ్ తెలంగాణ సెక్రటేరియట్ నుంచి బదిలీపై గుమ్మడిదల మున్సిపాలిటీ కమిషనర్ గా గురువారం రోజున బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మడిదల మున్సిపాలిటీ వార్డుల పరిధిలో ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని ప్రజలకు మౌలిక వసతుల కోసం తమ సిబ్బందితో ఎలాంటి సమస్య ఉన్న తక్షణమే చర్యలు చేపడతామని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోలు ప్రభాకర్, రాములు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, కార్మికులకు చీరలు పంపిణీ

**గుమ్మడిదల, జూన్ 26, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మైత్రి ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతోన్న విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీచేసి, గ్రామ పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే బంగారు భవిష్యత్తు

**-ఎంఈఓ వెంకటరాములు**

**మర్కుక్, జూన్ 26, ప్రభాతవార్త:**

విద్యార్థిదశలో కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని మర్కుక్ మండల విద్యాధికారి వెంకటరాములు అన్నారు. గురువారం మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్పందన చారిటబుల్ ట్రస్టు, బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ 230మంది విద్యార్థినీవిద్యార్థులకు స్టడీకిట్స్‌ను అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ రాములుగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.బాలకిషన్, ఉపాధ్యాయులు హారిక, సంతోషిమాత, చిన్నికృష్ణ, ఎస్ఎంసి చైర్మన్ కనకయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ నాగమణి, సిఆర్‌పి అంజలి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలి

**హుస్నాబాద్ టౌన్, జూన్ 26, ప్రభాతవార్త:**

వర్షాకాలం పంటలు సాగు చేసుకునే రైతులకు ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లిఖార్జునరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు వరి నాట్లతో పాటు పంట పొలాలలో పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎరువుల కోసం ఉదయం నుండి చెప్పులను క్యూలైన్లో పెట్టి నిలుచున్నా రైతులకు ఎరువులు దొరికేవి కాదని బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక విత్తనాలకు, ఎరువులకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకున్నామన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాత రోజులు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పర్శరాములు, పాకాల శ్యాంసుందర్, రాజు నాయక్, వికాస్‌యాదవ్, లక్ష్మణ్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## బిజెఎంసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాలుమహేందర్

**రామచంద్రాపురం, జూన్ 26, ప్రభాతవార్త:**

భారతీయ జనతా మజ్దూర్ సెల్ (బిజెఎంసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాలు మహేందర్ గురువారం ప్రమాణ స్వీకారంచేశారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి బిజెఎంసి జాతీయ చైర్మన్ శిశ్వప్రియ రాయి చౌదరి, జాతీయ అధ్యక్షులు ఆర్నబ్ చాటర్జీ, జాతీయ కార్యదర్శి ప్రశాంత్, జాతీయ యువ అధ్యక్షులు దీపక్ శర్మ, రాష్ట్ర అధ్యక్షులు నాగార్జున, రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాళీఫాతుల్లా భాష, రాష్ట్ర ఉపాధ్యక్షులు సివిబి రెడ్డి, హైద్రాబాద్ అధ్యక్షులు శ్రీదేవి రమేష్‌లు హాజరై మహేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన మున్సిపల్ కమిషనర్‌గా బి.శ్రీరామ్‌చరణ్‌రెడ్డి

**నర్సాపూర్, జూన్ 26, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా బి.శ్రీరామ్‌చరణ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన రామకృష్ణరావు బదిలీపై హైదరాబాద్ వెళ్లడంతో ఆయన స్థానంలో హైదరాబాదులోని సెక్రెటరియేట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసిన బి.శ్రీరామ్ చరణ్‌రెడ్డి పదోన్నతిపై నర్సాపూర్ పురపాలక కమిషనర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా నూతనకమిషనర్ బి.శ్రీరామ్‌చరణ్‌రెడ్డిని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది శాలువాతో సన్మానంచేశారు. కార్యక్రమంలో మేనేజర్ వి.మధుసూదన్, శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, సిబ్బంది శ్రీనివాస్, సల్ల మురళీ, విష్ణు, తదితరులు ఉన్నారు.

## నర్సాపూర్‌లో మాదకద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ

**నర్సాపూర్, జూన్ 26, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణంలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని విజన్ ఐఆర్‌సిఏ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీకి నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం హాజరయ్యారు. ఈ అవగాహనర్యాలీ నర్సాపూర్ పట్టణంలోని మెయిన్ రోడ్, పట్టణంలోని పలువీధులగుండా సాగింది. ఈర్యాలీలో మత్తుపదార్థాల వాడకంవద్దు, మాదకద్రవ్యాల జోలికిపోవద్దు అనారోగ్యాలపాలు కావద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలుచేశారు. కార్యక్రమంలో సిఐ జాన్‌రెడ్డి ఎస్ఐ లింగం లతో ట్రైనీ ఎస్ఐ శిరీష, ఎక్సైజ్ ఎస్సై రాఘవేందర్ రావు పాల్గొన్నారు.



ర్యాలీలో సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం

## నాచగిరి క్షేత్రంలో హుండీ లెక్కింపు

**-వంద రోజులకుగానూ రూ.26.26 లక్షల ఆదాయం**



26జీజేఎల్3: నాచగిరి క్షేత్రంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం

**వర్గల్, జూన్ 26, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ్మా స్వామి క్షేత్రంలో గురువారం వందరోజులకు సంబంధించిన హుండీ లెక్కింపు నిర్వహించడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు తెలిపారు. వందరోజులకుగానూ రూ.26 లక్షల 26వేల 343 రూపాయల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్య వేక్షణ అధికారి సిద్దిపేట జిల్లా ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది సుధాకర్, పాండు, నరేందర్, నర్సింలు, అవుట్‌పోస్ట్ పోలీస్‌సిబ్బంది, శ్రీ భ్రమరాంబిక సేవాసమితి, శివశక్తి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి సహకారం అందించండి

**-డిప్యూటీ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి**



డిప్యూటీకమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూన్ 26, ప్రభాతవార్త:**

రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి సహకరించాలని రామచంద్రాపురం కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పుష్పనగేష్ జిహెచ్‌ఎంసి డిప్యూటీకమిషనర్ సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ డివిజన్‌లో ఉన్న విద్యుత్‌దీపాల సమస్యను 700 కొత్త లైట్లు, 700 మెయింటెనెన్స్ లైట్స్‌ను మంజూరు చేయాలని డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకుపోయినట్లు కార్పొరేటర్ పుష్పనగేష్ పేర్కొన్నారు.

## హత్నూరలో మాదకద్రవ్యాల వ్యతిరేకదినోత్సవ ర్యాలీ



హత్నూరలో ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు

**హత్నూర, జూన్ 26, ప్రభాతవార్త:**

మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం, మండల కేంద్రమైన హత్నూరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించినట్లు ఎన్‌ఎస్‌యుఐ జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి వలిగారి సాయికుమార్ తెలిపారు. ర్యాలీ నిర్వహించి విద్యార్థినీవిద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించినట్లు ఆయన తెలిపారు.

## హరీష్‌రావుకు బిఆర్‌ఎస్ నేతల కృతజ్ఞతలు



మాజీమంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న బిఆర్‌ఎస్‌నేతలు

**రామచంద్రాపురం, జూన్ 26, ప్రభాతవార్త:**

రైతుభరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చేసిన మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుకు బిఆర్‌ఎస్ నియోజకవర్గ నేతలు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని జిన్నారం, పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్ మండలాల రైతులకు రైతుభరోసా అందచేయాలని హరీష్‌రావు రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వడంతో ప్రభుత్వం దిగివచ్చి రైతులకు రైతుభరోసాను విడుదల చేసిందని నియోజకవర్గ బిఆర్‌ఎస్ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి గుర్తుచేశారు. రైతులపక్షాన నిలిచే హరీష్‌రావుకు నియోజకవర్గ రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపామన్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు జిన్నారం వెంకటేష్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, జిన్నారం మాజీ జడ్పిటిసి సభ్యులు బాల్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, తెల్లాపూర్ మాజీసర్పంచ్ సోమిరెడ్డి, తెల్లాపూర్ మాజీ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, జిన్నారం, గుమ్మడిదల మండలాల బిఆర్‌ఎస్ అధ్యక్షులు రాజేష్, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పరమేష్‌యాదవ్, కాటా రాజేష్‌గౌడ్, మాణిక్‌యాదవ్, సాయి చరణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

**-పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఓ మల్సూర్‌నాయక్**

**సిర్గాపూర్, జూన్ 26, ప్రభాతవార్త:**

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఓ మల్సూర్‌నాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశం అయిన ఎంపిడిఓ పలు సూచనలు చేశారు. ఇంత వరకు మండలంలోని ఇళ్ల నిర్మాణం పనుల పురోగతిపై సమీక్షించారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో ఇళ్ల నిర్మాణం శరవేగంగా కొనసాగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపిడిఓ మల్సూర్ నాయక్ ఆదేశించారు.

## డ్రగ్స్‌నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

**-రామాయంపేట ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సృజన**

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 26, ప్రభాతవార్త:**

డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామాయంపేట ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సృజన పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాపరిషత్ బాలికల ఉన్నత విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాలపై(డ్రగ్స్)అవగాహన కల్పించేందుకు భారీర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా ప్లకార్డులు పట్టుకొని, నినాదాలతో ప్రజల్లో అవగాహనకల్పించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులతోపాటు, అంగన్‌వాడీ టీచర్లు,ఎస్.పద్మ,పల్లె దేవలక్ష్మి,శోభారాణి,ఎం.పద్మ, జమున,భాగ్యలక్ష్మి,ఓ.పద్మ,ఈ.రాధ,డి.పద్మతోపాటుపలువురు పాల్గొన్నారు.

# అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

**-జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి రాధిక**



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి రాధిక

**బెజ్జంకి, జూన్ 26, ప్రభాతవార్త:**

రైతులు మోతాదును మించి యూరియాను వినియోగిస్తే పంటలకు నష్టం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.సంతోష్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీచేసి ఎరువుల నిల్వల వివరాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్‌నుంచి వచ్చేయూరియాను రైతులకు పట్టా పాస్‌బుక్ ప్రకారం రైతుకు ఉన్న విస్తీర్ణానికి ప్రస్తుత దఫాకి ఒక ఎకరానికి ఒక బస్తా చొప్పున ఇవ్వాలని, పంట మొత్తానికి వేసే యూరియాను ఒకేసారి తీసుకెళ్లి నిల్వ చేసుకోవడానికి ఇవ్వకూడదన్నారు. ఈపాస్ మెషిన్ ద్వారానే ఎరువులు అమ్మలన్నారు. రైతులు పత్తికి మొదటగా 45రోజులవరకు కాంప్లెక్స్ ఎరువులు మాత్రమే వేయాలి, వరి పొలంకు సైతం ప్రస్తుత కాంప్లెక్స్ ఎరువులు మాత్రమే వాడాలన్నారు. మోతాదుకు మించిన యూరియా వినియోగిస్తే పురుగు,రోగాలు ఆశించి పెట్టుబడి ఖర్చులు పెరగడంతోపాటు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

**ఎరువులదుకాణాలను తనిఖీచేసిన జిల్లా వ్యవసాయాధికారిణి..**

ఎరువులను అధికధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి రాధిక హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని చిన్నకోడూరు,గంగాపూర్, సికింద్లాపూర్, రామంచ గ్రామాలలో ఉన్న ఎరువుల దుకాణాలను ఆమె అకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాలలో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి దుకాణంలో రైతులకు కావాల్సిన ఎరువులను విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. రికార్డులు, ఈపాస్ యంత్రాలలో ఎరువుల విక్రయాలను పరిశీలించారు. అధికధరలకు ఎరువులను విక్రయించొద్దన్నారు. రైతులు యూరియా అధిక మొత్తంలో కాకుండా అవసరం ఉన్నమేరకు కొనుగోలు చేయాలన్నారు. యూరియా కొరత లేదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జయంత్‌కుమార్, డీలర్లు ఉన్నారు.

## అద్దెగదిలో రెవిన్యూ కార్యాలయం

**-సతమతమవుతున్న ప్రజలు, అధికారులు**



అద్దెగదిలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

**సిర్గాపూర్, జూన్ 26, ప్రభాతవార్త:**

తహసీల్దార్ కార్యాలయం అద్దెభవనంలో (కనీస సౌకర్యాలులేని భవనంలో) కొనసాగుతుండటంతో అటు అధికారులు, ఇటు ప్రజలు నిత్యం అవస్థలు పడుతూ పనులు చేసుకుంటున్నారు. ప్రత్యేకమండలం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా, స్వంతభవనం నిర్మించడంలో ప్రభుత్వం విఫలమవడంతో ప్రజలు పాట్లు పడాల్సివస్తోంది. ప్రతినెల వేలరూపాయల అద్దెచెల్లిస్తూ కనీస సౌకర్యాలులేని అద్దె భవనంలో ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహిస్తుండటం పట్ల ప్రజలు విచారం వ్యక్తంచేస్తున్నారు. ఇరుకుసందులో ఉన్న కార్యాలయానికి చేరుకుని పనులు చేసుకునేందుకు ప్రజలు పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయి. పాలకులు, జిల్లా కలెక్టర్ స్పందించి తహసీల్దార్ కార్యాలయానికి స్వంతభవనం నిర్మించాలని మండలప్రజలు, ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.

## వసతిగృహాన్ని తనిఖీ చేసిన ఆర్‌సిఓ



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఆర్‌సిఓ నాగార్జునరావు

**కంగ్టి, జూన్ 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన కంగ్టిలోని టిటిడబ్లుఆర్‌ఎస్‌జెసి వసతి గృహాన్ని ఆర్‌సిఓ నాగార్జునరావు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులకు, వసతిగృహం బాధ్యులకు ఆర్‌సిఓ నాగార్జునరావు పలు సూచనలు చేశారు. విద్యార్థులపై ప్రత్యేకదృష్టిని సారించాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలు, వ్యాయామం చేసేలా చూడాలన్నారు. వసతిగృహం నుంచి ఎలాంటి తినుబండారాలు, వంటసామగ్రి, కూరగాయలు, బియ్యం, అన్నం తదితర సామగ్రి బయటకు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకుని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం

**-ఆరోగ్యంగా జీవనం సాగిద్దాం**

**చౌటకూరు, జూన్ 26, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని జెఎన్టీయుహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలునాటి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలునాటారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య రాఘవేంద్రరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆచార్య రజనీష్, సిఆర్సి చైర్మన్ ఆచార్య విజయకుమార్, ఆచార్య జోషి శ్రీపాద్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా కార్యాలయంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**సిద్దిపేట అర్బన్, జూన్ 26, ప్రభాతవార్త:**

బిజెపి జిల్లా కార్యాలయంలో గురువారం ఆపార్టీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ అధ్యక్షతన ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన కాళరాత్రి చీకటిరోజు ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తికావడంతోపాటు జూన్ 25న రాజ్యాంగ హత్య దివస్ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, జిల్లాపార్టీ అధ్యక్షులు బైరి శంకర్‌ముదిరాజ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, జిల్లా నాయకులు, వివిధ మండలాల మోర్చాల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, మండల ప్రభారీలు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**-ఎస్‌ఐ బి.తిరుపతిరెడ్డి**




డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమంలో ఎస్‌ఐ బిజతిరుపతిరెడ్డి

**బెజ్జంకి, జూన్ 26, ప్రభాతవార్త:**

విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ బి. తిరుపతిరెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనార్థాలు, నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, స్థానికులతో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్‌నిర్మూలనధ్యేయంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు కవిత, బాబు, శ్రీనివాస్, వెంకట్, పిడి కనకరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

**కోహెడలో...**

యాంటీడ్రగ్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా కోహెడ పోలీసు స్టేషన్ పరిధిలోని జూనియన్ కాలేజీ, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు, యువతకు పోలీసు అధికారులు, సిబ్బంది, మండల ప్రముఖులు పాల్గొని మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు అమ్మినా, సరఫరాచేసినా, సేవించినవారిపై కఠినచర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసుసిబ్బంది, కాలేజీ, పాఠశాల సిబ్బంది, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కొండపాక, జూన్ 26, ప్రభాతవార్త:**

ఓపెన్ స్కూల్ విధానంలో 2025, 2026 విద్యా సంవత్సరానికిగాను 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనవని దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, ఎఐ కోఆర్డినేటర్ రజిని ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ పొందాలనుకునే అభ్యర్థులు జూలై 11, 2025వ తేదీలోగా డబ్ల్యుడబ్ల్యు. తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్‌జి వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్, మీసేవ ద్వారా అడ్మిషన్ ఫీజు చెల్లించి, అడ్మిషన్ ఫారం ప్రింట్ అవుట్‌తో దుద్దెడ ఉన్నతపాఠశాలలో అందించాలని వారు సూచించారు. మరింత సమాచారం కొరకు 9849960596లో సంప్రతించాలని వారు సూచించారు.

# ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలి..

**-ఇన్చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ**



ఫోటో విధానాన్ని పరిశీలిస్తున్న రాజ్‌నారాయణ

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 26, ప్రభాతవార్త:**

రైతులు తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాలని ఇంచార్జి సహాయ వ్యవసాయ సంచాలకుటు రాజ్‌నారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబడిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మన్‌నిధిలో భాగంగా రామాయంపేట మండలవ్యాప్తంగా 31/1/2019 లోపు పట్టాదారు పాస్ పుస్తకం కలిగి ఉండి, పిఎం కిసాన్‌సమ్మన్‌నిధికి సంబంధించిన నిధులు ఇప్పటి వరకు 19 విడతలుగా 2000 చొప్పున డబ్బులు రైతులకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేయబడుతున్నాయని అన్నారు. రామాయంపేట మండలవ్యాప్తంగా 6,180 మంది రైతులకు పిఎం కిసాన్‌కు సంబంధించినది అందుతుందని, ఇందులో ప్రతి సంవత్సరం ఐదు శాతం రైతులను తనిఖీ నిర్వహించడం జరుగుతుంని తెలిపారు. ఇందులో భాగంగా 2022,23 సంవత్సరానికి గాను 245 మంది రైతులు, 2023,24 సంవత్సరానికి గాను 256మంది రైతులు తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాల్సి ఉంటుందని, ఇందుకుగాను రైతులు తమ ఆధార్ ఖాతా వివరాలను అందజేసి వ్యవసాయ విస్తీర్ణ అధికారి దగ్గర ఏర్పాటుచేసిన ప్రత్యేకమైన పిఎం కిసాన్ యాప్‌నందు ఫోటో దిగాల్సి ఉంటుంది. కావున వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారికి కలిసి ఈకెవైసి చేయించుకోవాలని రాజ్‌నారాయణ తెలిపారు.ఈసందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం ఆవరణలో పలు రైతులకు సంబంధించిన రైతుల ఈకెవైసి లో భాగంగా ఫోటోతీసే విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సాయికృష్ణ, శ్రీనివాస్, సందీప్, ప్రవీణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాలిపోయిన ఇంటెక్ వెల్ మోటారు

**-16 గ్రామాలకు సరఫరా కాని తాగునీరు**

**చౌటకూరు, జూన్ 26, ప్రభాతవార్త:**

మంజీరానీరు సరఫరాచేసే ఇంటెక్‌వెల్ బోరు మోటారు కాలిపోవడంతో మండలంలోని 16గ్రామాల ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఇంటెక్ వెల్ నుంచి మండలంలోని ఆయా గ్రామాలకు నిత్యం తాగునీరు సరఫరా అయ్యేది. బోరు మోటారు మరమ్మతుకు గురికావడంతో ఆయా గ్రామాలకు గత రెండురోజుల నుంచి తాగునీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు వ్యవసాయ బావులను ఆశ్రయించాల్సిన దయనీయ పరిస్థితి దాపురించింది. రెండురోజులుగా 16గ్రామాల ప్రజలు తాగునీటికి తహతహలాడుతున్నా అధికారులకు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆగిపోయిన తాగునీటి సరఫరాను వెంటనే సరఫరా అయ్యేలా చేయాల్సిన అవసరం ఉందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

## శివంపేట జడ్పిహెచ్‌ఎస్‌లో ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఎంఈఓ బాలయ్య

**చౌటకూరు, జూన్ 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని శివంపేటలోని పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏక్‌భారత్ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా హరియాన్‌వి ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులు తమ ఇళ్లనుంచి రకరకాల వంటలను తయారుచేసుకుని వచ్చి కార్యక్రమంలో ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన వంటకాలను మండల విద్యాధికారి బి.బాలయ్య పరిశీలించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.వేదశ్రీ, ఉపాధ్యాయులు పి.సునీతావేణి, పి.మల్లేశం, అబ్దుల్ ఖదీర్, బి.మాణిక్యం, ఎన్.రాములు, ఎస్.రాములు కె.వీరేశం, కె.శైలజ, టి.స్వప్న, సునీతాబాయి, వాణిశ్రీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కంగ్టిలో విద్యార్థులతో కలిసి ఎస్‌ఐ ర్యాలీ



కంగ్టిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ దుర్గారెడ్డి

**కంగ్టి, జూన్ 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన కంగ్టిలో గురువారం నిషేధిత డ్రగ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌ఐ దుర్గారెడ్డి విద్యార్థులతోకలిసి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ కూడలి నుంచి బసవేశ్వర చౌరస్తా వరకు విద్యార్థులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

## పంచాయతీని పరిశీలించిన ఎంపిఓ

**కంది, జూన్ 26, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని ఎర్దనూర్‌గ్రామాన్ని గురువారం మండల పంచాయతీ అధికారి మహేందర్‌రెడ్డి సందర్శించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామంలను తనిఖీ చేశారు. తడిచెత్త పొడిచెత్త సెగ్రిగేషన్ షెడ్‌లో వేసి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. నర్సరీలో మొక్కల వేర్లు లోపలికి పోయినందున వాటిని షిఫ్టింగ్ చేయాలని, వైకుంఠధామంలో మొలిచిన పిచ్చిమొక్కలను, ముళ్ల పొదలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి మాణిక్యంను ఎంపిఓ ఆదేశించారు.

## దివ్యాంగులకు పెన్షన్‌లు అందచేయాలి

**-ఎంపిడిఓకు కెవిపిఎస్ నాయకులు శ్రీనివాస్ వినతి**



ఎంపిడిఓకు వినతి పత్రం అందచేస్తున్న కెవిపిఎస్ నాయకులు

**సిర్గాపూర్, జూన్ 26, ప్రభాతవార్త:**

అర్హులైన దివ్యాగులందరికీ పెన్షన్‌ను అందచేయాలని కెవిపిఎస్ ఆధ్వర్యంలో గురువారం ఎంపిడిఓకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లానాయకులు బిజశ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని అర్హులందరికీ పెన్షన్‌లు అందచేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. పెన్షన్‌లు అందక దివ్యాంగులు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. దివ్యాంగులకు పెన్షన్‌లు మంజూరు అయ్యేలా చేయాలని శ్రీనివాస్ వినతి చేశారు.

## యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లొద్దు..




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, జూన్ 26, ప్రభాతవార్త:**

యువత మత్తుపదార్థాల జోలికివెళ్లి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం పాపన్నపేటలో మత్తు పదార్థాల నిర్మూలనపై జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సతీష్‌కుమార్, ఎంపిడివో విష్ణువర్ధన్, అధ్యాపకులు శ్రీనివాస్, రమేష్, నవీన్, ప్రవీణ్, పోలీసులు, తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**శివ్వంపేట, జూన్ 26: ప్రభాతవార్త:**

శివ్వంపేట మండలంలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన కుల్ల లక్ష్మి కొన్నిరోజులక్రితం అనారోగ్యంతో బాధపడుతూ మరణించింది. గ్రామస్థులద్వారా విషయంతెలుసుకున్న పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి 5వేలరూపాయలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కుల్ల వెంకటేష్, కుల్ల సత్యం, కుల్ల రవి, బేగరి నాగరాజ్, జంగారాయి శ్రీకాంత్, గ్రామస్థులు పాల్గొన్నారు.